

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - మూడవ కథ -

2004 అనుకుంటా. అప్పుడు మేము హాస్పిటల్ పైనే ఉండేవాళ్ళం. హాస్పిటల్ పైనే ఉండడంలో ఒక సుఖం ఉంది.ఎప్పుడు కావాలంటే అప్పుడు పేషంట్ ను చూసుకోవచ్చు. అంతేకాదు, వాళ్ళక్కూడా డాక్టర్ గారు పైనే ఉన్నారన్న నిశ్చింత ఉంటుంది.

అలా హాస్పిటల్ పైనే మేముండే రోజుల్లో, మా పిల్లాడికి సరైన స్నేహితులుండేవాళ్ళు కాదు. మా కాంపౌండర్లు, నర్సుల్తో ఆడుకునే వాడు. వాళ్ళేమో వీణ్ణి ఓటమి నుండి కాపాడుతూ, మర్యాదగా అన్ని ఆటలూ ఓడిపోతుండేవాళ్ళు. దాంతో వీడికి తానేదో గొప్పవాడిననే ఓ కనపడని కొమ్ము మొలిచింది. అది వేగంగా పెరగడం గమనించిన మేము, దాన్ని కోసేసే నిమిత్తం ఓ అపార్ట్ మెంట్ ఫ్లాట్ తీసుకుని అందులోకి మారాము.

ఆదివారం నాడు , వీడు అందరి పిల్లలతో ఆడుకునేప్పుడు, నేను పైన బాల్కనీలో, ఆరేసిన చీరలవెనక నిల్చుని, వీడు అందరితో కలుస్తున్నాడా లేదా అని మా వాణ్ణి గమనిస్తుండేదాన్ని. అలా ప్రతి ఆదివారం, పిల్లల్ని గమనించడం ఓ ఇష్టమైన వ్యాపకంలా మారింది. అప్పుడప్పుడు వీళ్ళ బంతి , అపార్ట్ మెంట్ పక్కనే ఉన్న ఓ ఇంటి ఆవరణలో పడేది. ఆ ఇల్లు ఓ పాతకాలపు గోపీ రంగు మేడ. చుట్టూ కొంతమేర నాపరాళ్ళు పరిచారు. నాపరాళ్ళ చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశం లో ఓ పక్కన కనకాంబరం మడి ఉండేది. కరివేపాకు, గోరింట, దానిమ్మ, జామ చెట్లే కాకుండా . చిన్న కమలాకాయలంత సైజులో పసిమి నిమ్మకాయల చెట్టుండేది. కనకాంబరాలను మనసులోనే మాలకట్టి, కరివేపాకు లేతరెమ్మల్ని ఊహల తాలింపు లో వేసేస్తూ, మధ్యమధ్యలో పిల్లల్ని చూస్తూ ఉండేదాన్ని.

ఎప్పుడు చూసినా ఒకే అనుమానం వచ్చేది. ఆ నాపరాళ్ళని అంత శుభ్రంగా కడుగుతోంది ఎవరు. ఆ చెట్లను అంతబాగా పెంచుతున్నది ఎవరు అని. ఆ ప్రశ్నలకు సమాధానం ఓ రోజు తెల్లవారుజామున ఏదో కేసు కోసం వెళ్తుంటే తెలిసింది. పెద్ద ఇనపబకెట్ తో నీళ్ళు మోస్తున్న ఓ బక్క పలచని అమ్మాయి కనిపించింది. ఓ పదహారేళ్ళుంటాయేమో..

★★★★★★★★

ఓ రోజున నిద్రపోతుంటే అరుదుగా మోగే అపార్ట్మెంట్ ఫోన్ మోగింది.

"ఎవరూ?"

"నేనమ్మా, వెంకటేశుని. మెయిన్ గేట్ వాచ్ మేన్నమ్మా."

"ఏమైంది?"

" అమ్మా, ఈళ్ళు మన పక్కింట్లో ఉంటారమ్మా, ఆ అమ్మాయికి బాలేదని ఆయమ్మాళ్ళ నాన్నా, అన్నయ్యా వచ్చారు."

హాస్పిటల్ లో ఉన్నాననుకుని, నిద్ర మత్తులో " సరే నేనొస్తున్నాను చూడడానికి."

"అమ్మా ఏడికొస్తారు?"

మత్తు వదిలింది.

"సరే ఆ అమ్మాయిని లిఫ్ట్ లో పైకి తీసుకురా ."

ఆ అమ్మాయి తో పాటు ఆమె తండ్రీ, అన్నయ్యా వచ్చారు.

సాయంత్రం నుండీ కడుపులో నొప్పిగా ఉందట . మెడికల్ షాపు నుండి టేబ్లెట్ తెచ్చి వేశారట గానీ పనిచెయ్యలేదని , నొప్పి ఇంకా ఎక్కువైందనీ చెప్పారు.

మా వంటావిడ లేచి వచ్చింది. నేను పరీక్ష చేయడానికి వీలుగా హాల్లో ఉన్న దీవాన్ మీద పడుకోబెట్టి, దుప్పటి కప్పింది. వీళ్ళు కాసేపు బయట నిల్చున్నారు.

ఆ అమ్మాయికి పదిహేడేళ్ళట. చూట్టానికి పధ్నాలుగులా ఉంది. ఆరోగ్యం లేని తెలుపు. పలుచని బుగ్గలు. పలుచని పెదవులు. అవి కూడా పగుళ్ళిచ్చాయి.

బొడ్డు కింద కుడి వేపు నొప్పి అంది. మెల్ల తడిమితే గిలగిల లాడింది.

పెళ్ళికాని పిల్లకు కడుపులో కుడిచేతి వైపు నొప్పి అంటే అనుమానపు మొదటి వేలు అపెండిసైటిస్ వైపే చూపిస్తుంది.

ఎక్కువగా లేటు చెయ్యకుండా హాస్పిటల్ కు తీసుకెళ్ళి స్కానింగ్ కూడా చూస్తే , అపెండిక్స్ వుండవలసిన ప్రదేశం లో గజిబిజిగా ఉంది. స్కానింగ్ చేస్తున్నప్పుడు కూడా అదే ప్రదేశంలో ఆ అమ్మాయి నొప్పి తట్టుకోలేక అల్లాడుతోంది.

సరిపడినంత రక్తం లేదని, బ్లడ్ అరేంజ్ చేసి ఆపరేషన్ కోసం థియేటర్ కు తీసుకెళ్ళాం.

పొట్ట ఓపెన్ చేసి అపెండిక్స్ కోసం వెతికితే, అది నేను నిరపరాధినంటూ ఆరోగ్యంగా కనిపించింది. దాదాపు అదేప్రదేశం లో ఉండే ఫేలోపియన్ ట్యూబ్ వాచి, పగిలిపోయి ఉంది. పగిలిన ట్యూబ్ నుండి తొంగిచూస్తోందొక ఏడువారాల పిండం!!!

ట్యూబల్ ప్రెగ్నెన్సీ.

అంటే గర్భాశయం పక్కనే ఉన్న ఫేలోపియన్ ట్యూబ్ లో గర్భం వచ్చింది. గర్భాశయం అయితే ఎంతైనా వ్యాకోచించగలదు, మూడు కేజీల బిడ్డ నైనా, ముగ్గురు బిడ్డలనైనా సరే తనలో ఇముడ్చు కోగలదు. కొన్ని సార్లు పొరపాటున, గర్భాశయం పక్కనే , సన్నటి పెన్ను పరిమాణంలో ఉన్న ట్యూబులో గర్భం వస్తే అది ఎక్కువకాలం నిలబడదు. రెండో నెలలోనే కడుపులో నొప్పి రావడం, పగిలిపోవడం జరుగుతుంది.

అలాగే జరిగింది.

ఆశ్చర్యాన్ని పక్కన పెట్టి పగిలిపోయిన ట్యూబ్ తీసేశాము. ఆపరేషన్ అయేసరికి తెల్లవారుజాము అయిదయింది. .

అమ్మాయికి మత్తు వదల్లేదు. స్టాఫ్ ఆమెను థియేటర్ నుండి వార్డ్ కు మార్చడానికి ట్రాలీ కోసమని వెళ్ళారు. ఆమెవంకే చూస్తూ నిలబడ్డాను. బలహీనంగా ఉంది ఆ అమ్మాయి .

ఆ పిల్ల తప్పు చేసిందని అనుకోబోతే, మనసు నన్ను తప్పుపట్టింది. ఇంత పిచ్చి పిల్లకు ఎవరిలా చేసిందీ?

వాళ్ళు అపెండిక్స్ అనుకుంటున్నారు, కానీ సంగతి తెలిస్తే? అసలీ విషయాన్ని ఎలా చెప్పాలి.

చెప్తే ఎలా రియాక్ట్ అవుతారు?

చెప్పకుండా వదిలేసే విషయం కాదు.

చెప్తే నమ్మక పోగా, ముందు అపెండిక్స్ అన్నారు, ఇప్పుడేమో పెళ్ళికాని పిల్ల మీద ఇలాంటి అభాండాలు వేస్తారా అని ఎదురుతిరిగే చాన్సుంది.

టైం గాని టైం లో చెప్పడమెందుకు, ఆ ట్యూబుని , అందులో ఉన్న పిండాన్నీ పరీక్షకు పంపి రిపోర్ట్ వచ్చిన తర్వాత ఎలా చెప్పాలో బాగా ఆలోచించి చెప్దాంలే అనుకున్నాను.

థియేటర్ బయటికి వచ్చాను.

ఆదుర్దాగా నిల్చున్న వాళ్ళ నాన్న, అన్నయ్యతో "ఆపరేషన్ అయింది, పరిస్థితి ఇప్పుడు బాగానేఉంది" అన్నాను.

హాస్పిటల్ లో ఎన్నాళ్ళుండాలి , ఎప్పుడు ఆహారమిస్తారు. ఇలాటి ప్రశ్నలకు ఎప్పుడూ చెప్పే జవాబులే చెప్పాను.

ఓ పావుగంటలో అమ్మాయిని షిఫ్ట్ చేయమని చెప్పి వచ్చి నారూం లో కూర్చున్నాను.

కూర్చున్న కాసేపటికి ఏదోపెద్ద గొడవ వినిపించింది.

గభాల్న లేచి బయటికెళ్ళాను. ఆ అమ్మాయి వాళ్ళ అన్నయ్య మా కాంపౌండర్ జానీని చొక్కా పట్టుకుని కొట్టబోతున్నాడు. ఆవేశంతో రొప్పుతున్నాడు. నేనూ, మిగతా స్టాపూ పట్టుకుని విడదీశాము.

మా జానీ ఎప్పటినుండో కాంపౌండర్ గా పని చేస్తున్నాడు. నేను ఆపరేషన్ చేస్తుంటే అవతలి వేపుండి సహాయం చేస్తుంటాడు.

పేషంట్లను ఎత్తి బెడ్ మీద పడుకోబెట్టడం, మళ్ళీ వాళ్ళను వీల్ చెయిర్ లో రాంప్ మీద తోసుకురావడం, హాస్పిటల్ లో అన్ని పనులూ నాది కాదనుకోకుండా చేస్తాడు.

ఆపరేషన్ స్ట్రెచర్ మీదనుండి ఆ అమ్మాయిని రెండు చేతులతో ఎత్తి బెడ్ మీదకు షిఫ్ట్ చేయబోతే వాళ్ళ అన్నయ్య కి కోపం వచ్చింది.

"మేడం, మీకు లేడీ స్టాఫ్ లేరా. అన్నిటికీ ఈడొస్తాన్నాడేంటీ ?"

ఆ రోజు రాత్రి మా నర్సు వంట్లో బాగోలేదని రాననీ చెప్పింది. ఒకవేళ ఉన్నాగానీ, జానీ సహాయం లేకుండా ఆమె కూడా షిఫ్ట్ చేయలేదు.

"వీడు అమ్మాయిమీద చెయ్యేస్తే ఊరుకునేది లేదు."

అటూ ఇటూ గాని టైం లో, ఆ గొడవకు విసుగొచ్చింది.

నేనూ, మా ఆయమ్మలూ, చిన్న నర్సూ కలిపి బెడ్ మీద పడుకోబెట్టాము.

బయట ఆ అబ్బాయి కారిడార్ లో, చేతులు కట్టుకుని , ఓ కాలు వెనక్కి మడిచి గోడకు తన్ని పెట్టి, కోరగా చూస్తున్నాడు.

నేను సంజాయిషీ ఇవ్వదలుచుకోలేదు, అక్కడికి నేనేదో తప్పుచేసినట్లు ఒప్పుకున్నట్లవుతుందని !

లోపల లోపల తిట్టుకుని మా జానీ కోసం వెతికాను.

ఆపరేషన్ థియేటర్ లో సామాన్లు శుభ్రం చేస్తున్నాడు.

"ఏమనుకోవద్దు జానీ, రకరకాల మనుషులొస్తుంటారు. ఏం చేస్తాం చెప్పు " అన్నాను.

"అయ్యో, పర్లేదు మేడం." అన్నాడు.

ఆపరేషన్ చేసే టైం లో నేనెంత అరిచినా ఏమనుకోడు గానీ , బయట మాత్రం నేను చిన్న మాటంటే తట్టుకోలేడు. కళ్ళనీళ్ళు పెట్టేస్తాడు. మా పిల్లల్నన్నా చెడామడా తిట్టేయగలను కానీ జానీ దగ్గర జాగ్రత్తగా ఉంటాను. మనసు వెన్నకన్నా సున్నితం. ఈ మధ్యనే పెళ్ళైంది.

థియేటర్ లోనే ఓ స్టూల్ మీద కూర్చున్నాను. నర్సు వచ్చి పేపరూ, కాఫీ పక్కనే పెట్టింది.

తొలగించిన ట్యూబునీ అందులో పిండాన్నీ, మిగతా టిష్యూనీ పెథాలజీకు లేబరేటరీకి పంపించేందుకు ఫార్మలిన్ బాటిల్ లో వేసి తెచ్చాడు. దాంట్లో ప్రాణం లేని అతి చిన్న పిండం కదులుతోంది.

ఎంత చిన్నపిండమైనా మైక్రోస్కోపు సహాయం లేకుండా గుర్తు పట్టగలిగిన అవయవం కన్ను. నల్లగా ఉబ్బెత్తుగా మెరుస్తోంది. కంటికన్నా ఎన్నో పెద్ద అవయవాలున్నాయి. ఇదొక్కటే ఎందుకింత కొట్టొచ్చినట్టు కనిపిస్తోందీ ?

‘ సర్వేంద్రియాణాం నయనం ప్రధానం’ అందుకేనా అన్నారు?

ఆలోచిస్తోంటే కాఫీ చల్లారిపోయింది. అదే తాగి బయటికొచ్చి ఆ అమ్మాయిని చూడడానికి వెళ్ళాను.

నొప్పిగా ఉందేమో మూలుగుతోంది.

ఫైల్ మీద పేరు చూశాను.

సుమతి.

“ సుమతీ” అని పిలిస్తే కళ్ళు విప్పి చూసింది.

“బాగా నొప్పిగా ఉందా?”

లేదన్నట్టు తలూపింది. ఆ అమ్మాయి దగ్గర్నుండి బయటకు వచ్చే సరికి పిల్ల తండ్రి నిల్చుని ఉన్నాడు.

" అబ్బాయి కొంచం పద్ధతి గల మనిషమ్మా. కొన్ని విషయాల్లో నిక్కచ్చిగా ఉంటాడు. తేడా జరిగితే ఊరుకునే రకం కాదు. మరి మగ స్టాఫ్ అమ్మాయిని తాకడం తప్పేకదమ్మా." వాళ్ళ అబ్బాయి ప్రవర్తనను సమర్థిస్తూ అన్నాడు.

★★★★★★

రెండు రోజులు గడిచాయి.

అమ్మాయికోలుకుంది. నడుస్తోంది. ఆహారం కూడా తీసుకుంది.

ఈ రెండు రోజుల్లో తెలిసిన వివరాలేమిటంటే, పదేళ్ళ క్రితం భార్య పోయాక పిల్లలతో వచ్చి ఇక్కడ స్థిరపడ్డాడట అమ్మాయి తండ్రి. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. వాళ్ళకు బస్టాండ్ పక్కన ఒక హోటల్, కొంచం దూరంలో ఉన్న సినిమా హాలు పక్కనే ఒక రెడీ మేడ్ బట్టల షాపు ఉంది. తండ్రీ, అన్నా, పొద్దున్న పనికి వెళ్తే రాత్రికి గానీ రారు. ఆ అమ్మాయిని సెవెంత్ క్లాసు వరకూ చదివించి ఆపేశారట.

ఆమె దగ్గరకు ఎవరొస్తున్నారో ఏమిటో..

ట్యూబులో గర్భం వచ్చినట్లు నిర్ధారిస్తూ హిస్టోపెథాలజీ రిపోర్ట్ కూడా వచ్చింది. వాళ్ళకు ఎలా చెప్పాలనేది పెద్ద సమస్య అయింది.

ఆ తర్వాతి రోజు ఆదివారం పిల్లల ఆటలు చూసేందుకు బాల్కనీ లో కూర్చుంటే వెంటనే ఆ చూపులు ఆ గోపీ రంగు డాబా వైపు తిరిగాయి. నాపరాళ్ల ఆవరణలో అన్నీ ఎండుటాకులు పడిఉన్నాయి. కనకాంబరాల మడి మరింత వత్తుగా పూసి, చాలా పూలు రాలిపోయి ఉన్నాయి. నిశ్చింతగా లేత రెమ్మలతో , ముదురు కొమ్మలతో కరివేపాకు చెట్టు గాలికి ఊగుతోంది.

ఆ పిల్లకు జరిగిన ఘోరం ఆ తోటకు తెలియకుండా ఉంటుందా?

తెలియని దిగులు కమ్ముకుంది. లోపలికొచ్చి కూర్చున్నాను.

పనమ్మాయి హాల్లో తడిగుడ్డతో తుడుస్తోంది.

"అమ్మా, ఆ అమ్మాయి ఎట్లా ఉందీ?" అడిగింది.

"బాగానే ఉంది. "

పనమ్మాయి తుడవడం కానిచ్చి, బకెట్ తీసుకుని వెళ్ళబోతుంటే అడిగాను.

"వాళ్ళింటికి చుట్టాలెవరైనా వస్తారా పద్మా?"

" నేనెప్పుడూ సూడలేదమ్మా, ఒక్కతే ఉంటది. పనంతా ఆయమ్మాయే సేసుకుంటది. ఆ మజ్జెన మాయన్న పెళ్ళప్పుడు పూలుకావాల్సొచ్చి ఎళ్ళాను ఆళ్ళింటికి . టీవీ కూడా లేదు ఇంటో. ఏమడిగినా ముంగిలా కూసుంది."

నేనేం మాట్లాడలేదు.

పనమ్మాయి మళ్ళీ అడిగింది

" ఇరవైనాలుగ్గంటల కడుపుల్నొప్పి ఆపరేషన్ అంట గదమ్మా, ఎప్పుడు పంపిస్తారూ?"

" రేపు."

అవును రేపే డిస్చార్జ్ చెయ్యాలి. చెయ్యబోయే లోగా విషయం చెప్పి, జాగ్రత్తలు కూడా చెప్పాలి.

చెప్పకుండా పంపించలేను.

చెప్తే ఏం జరుగుతుందో . ఆ అమ్మాయిని తండ్రీ, అన్న ఏం చేస్తారో.

ఎందుకైనా మంచిదని, తెలిసిన పోలీసు ఆఫీసర్ కు ఫోన్ చేసి ఓ కేసు విషయంలో సహాయం కావల్సి ఉంటుందని , అవసరమైనప్పుడు రావాలని రిక్వెస్ట్ చేశాను.

'తప్పకుండా' అని ప్రామిస్ చేశాడు. .

★★★★

ఆ రోజు పిల్లల స్కూలు ఏనివర్సరీ. ఆ సాయంత్రం పిల్లల్ని స్కూల్లో దింపి, కాసేపు కూర్చుని, స్టేజ్ మీద జరిగేది మనసెక్కడో పెట్టి చూశాను.

మా పిల్లలు వాళ్ళ గోలలో వాళ్ళు పడ్డాక నెమ్మదిగా జారుకుని, రాత్రి ఏడింటికి హాస్పిటల్ కు వచ్చాను.

హాస్పిటల్ కు మెయిన్ గేట్ కాకుండా వెనకనుండి ఓ చిన్న ద్వారం ఉంది. ముందు వేపునుండి వస్తే, తెలిసిన పేషంటులు టోకెన్ నంబర్లను పక్కన పడేసి గబగబా లోపలికొస్తానంటారు. ముందు ఉన్న వాళ్ళతో గొడవలు. వీటన్నింటినీ తప్పించుకోడానికి ఎవరికీ కనపడకుండా వెనక నుండి వచ్చి రూం లో కూర్చుని , ఒక్కొక్కళ్ళను పిలుస్తాను.

అప్పటికి కరెంట్ పోయిందేమో చీకటిగా ఉంది. రిసెప్షన్ దగ్గరా, అక్కడక్కడా కొవ్వొత్తులు వెలిగించి ఉన్నాయి.

ఆ సన్నని వెలుగులో జాగ్రత్తగా చూసుకుంటూ నేను వెనక వేపు నుండి వస్తుంటే, అటు పక్క మెట్లమీద సుమతి కూర్చుని ఉంది.

" ఇక్కడ కూర్చున్నావే సుమతీ?"

ఎప్పటిలానే ఏమీ మాట్లాడకుండా తల అడ్డంగా తిప్పింది. నాతో రమ్మనమని సైగ చేసి, లోపలికి తీసుకొచ్చాను.

నేను రూం లోకి రావడం ఎవరూ చూడలేదు, పైగా ఒపిలో పేషంట్లు ఎవరూ లేరేమో, బయట మెయిన్ డోర్ వద్ద స్టాఫ్ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకోవడం వినిపిస్తోంది.

సుమతిని నా రూం లో కూర్చోబెట్టి చప్పుడు రాకుండా తలుపు వేశాను. రూం లో రెండు కొవ్వొత్తులు వెలిగించి ఉన్నాయి కానీ చీకటే డామినేట్ చేస్తోంది.

రేపు ఇంటికి పంపిస్తాననీ, ఆ తర్వాత ఏం తినాలీ, మళ్ళీ చెక్ అప్ కు ఎప్పుడు రావాలీ అవి మాట్లాడాను.

ఆమె ఋతుక్రమం గురించి కొన్ని వివరాలు అడిగాను. తనకు తోచినట్లు సమాధానాలు కూడబలుక్కుంటూ చెప్పింది.

"సుమతీ, నీకు టైం ఎలా గడుస్తుందీ?"

" పని ఉంటుందిగా."

"మరి నీకు ఫ్రెండ్స్ ఎవరైనా ఉన్నారా?"

" ఊహూ.."

"మీ అమ్మ నీకు గుర్తుందా?"

"ఊ..."

" మా బాబు నీకు తెలుసా?"

తెలుసన్నట్టు తలూపింది.

“నీకు ఎప్పుడైనా తోచకపోతే మా ఇంటికి రా, మా పిల్లలతో ఆడుకుందువు గాని"

సమాధానం చెప్పలేదు.

కాసేపు మౌనంగా కూర్చున్నాం.

“ నీకు పిల్లలెలా పుడతారో తెలుసా?”

ఏదో అంది. తెలుసో తెలియదో అర్థం కాలేదు.

మామూలుగా అయితే, చెప్పలేని కొన్ని వివరాలు స్పష్టంగా చెప్పేందుకు, మసకవెలుతురు సహాయం చేస్తోంది.

మొన్న తనకి ఏమైందో ,ఆపరేషన్ ఎందుకు జరిగిందో కొవ్వొత్తి వెలుగులో బొమ్మ గీసి అర్థమయేట్లు చెప్పాను.

"ఇప్పుడు చెప్పు , ఎవరైనా అలా చేస్తున్నారా?"

“-----------.”

“ దాచకుండా చెప్పు సుమతీ, ఎవరు నీతో అలా... అదే...ఎవరు నిన్ను”

ఎంతో సేపు మౌనంగా కూర్చుంది.

నేను కూడా కదిలించలేదు.

పావుగంట గడిచింది. మాట్లాడదు. సుమతి దగ్గర సహనం కోల్పోయే అవకాశం ముందే కోల్పోవడం వల్ల , నేనూ ఓపికగా కూర్చున్నాను.

మళ్ళీ నేనే

“ఇప్పుడు జరిగింది, నీకు మళ్ళీ జరక్కుండా చూసుకోడానికి నేనున్నాను. నీతో ఎవరూ అలా చెడ్డగా ప్రవర్తించకుండా నేను చూసుకుంటాను.”

“-----------.”

"ఎవరో చెప్పు, వాళ్ళు నీ జోలికి రాకుండా నేను చూసుకుంటాను."

" మరి --- నాన్న,---అన్నయ్య---"

" వాళ్ళ గురించి భయపడకు , వాళ్ళిద్దరూ నిన్నేం అనకుండా నేను చూసుకుంటాను."

"---------"

"నీ దగ్గరకు ఎవరొస్తున్నారు ? చెప్పు, ప్రెగ్నన్సీ ఎవరి వల్ల వచ్చింది. ?"

" ఎవరో నాకెట్టా తెలుస్తుందీ?------. నాన్నో--- మరి అన్నయ్యో... రాత్రి పూట ఒకరి తర్వాత ఒకరు-----"

ఆవేశం

కోపం

ఆశ్చర్యం

భయం

జుగుప్స

కరుణ

దుఃఖం

ఏడూ కలిసి, కనిపించని ఏడుపైంది.

ఫోన్ తీసి ఒక నంబర్ డయల్ చేశాను.

" మేడం, రెడీగానే ఉన్నాము. రమ్మంటారా?" అవతలి కంఠం.

★★★★★★

సుమతి విమెన్ వెల్ఫేర్ సంస్థ , పోలీసుల సహాయంతో బయట పడింది. ఆ తర్వాత సుమతికి తోటల పెంపకంలో ట్రెయినింగ్ ఇచ్చారు. ఒక మెట్రో పాలిటన్ సిటీలో ఎంతో మంది సెలబ్రిటీల ఇంటిముందున్న గార్డెన్ లు సుమతి పర్యవేక్షణ లో అందంగా పెరిగాయి. సుమతి చాలా బిజీ అయింది కూడా!

ఆ మధ్యన ఆ ఊరెళ్తే ఓ అందమైన మొక్క , మంచి కుండీలో పెట్టి బహుమతిగా ఇచ్చింది. దాన్నెలా పెంచాలో చక్కగా వివరించింది.

అది మా ఇంట్లో బాగా పెరుగుతోంది. దానికి పేరు కూడా పెట్టాను 'సుమతి '.

★ ప్రైవసీ కాపాడే నిమిత్తం ఆ మొక్క పేరు మార్చాను.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments